## ప్రజా సమస్యలపై మంత్రి సత్యకుమార్ దృష్టి

ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు హరీశ్ బాబు

నియోజకవర్గం లోని ప్రజాసమస్యలపై రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. మంగళవారం పార్కును సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో పేరుకుపోయిన చెత్త పాడైపోయిన విద్యుత్ దీపపాలు, చిన్నారుల ఆటపరికరాల కొరత, వాకింగ్ ట్రాక్ సరిగా లేకపోవడం వంటి సమస్యలను గుర్తించారు. అలాగే పార్కులో శ్రీశివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు, చిన్నపిల్లల కోసం రంగుల రాట్నం, ఫైబర్ ఉయ్యాలలు వంటి వినోధ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రజలు వినిపించినట్టు తెలిపారు. పార్కు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్లకు సూచించారు.

## గుంతకల్లు రైల్వే కాలనీలను పరిశీలించిన... డిఆర్ఎమ్ గుప్తా

గుంతకల్ రైల్వే ఫిబ్రవరి 24: ప్రభాత వార్త


రైల్వే కాలనీలను పరిశీలించిన డిఆర్ఎం గుప్తా

గుంతకల్ రైల్వే డివిజన్లో రైల్వే క్వార్టర్స్ లో చోరీకి గురైన క్వార్టర్స్ లను పరిశీలించిన రైల్వే మేనేజర్ చంద్ర ఎస్ గుప్త, డివిజన్లోని సంబంధిత శాఖాధికారులతో కలిసి ప్రభాత్ నగర్ మరియు హనుమాన్ నగర్ రైల్వే కాలనీలను పరిశీలించారు. ఉద్యోగస్తుల నివాస క్వార్టర్ల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను తక్షణమే తొలగించాలనీ, తగినంత వెలుగుల ఏర్పాట్లు చేయాలనీ డీఆర్ఎమ్ అధికారులు కు ఆదేశించారు. అలాగే కాలనీ ప్రాంతాల్లో సమగ్ర పర్యవేక్షణ కోసం సరైన భద్రతా కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులందరికీ డీఆర్ఎమ్ సూచించారు.

## కుటుంబ ప్రగతికి ఆర్థిక క్రమశిక్షణ అవసరం

బత్తలపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన బ్యాంక్ అధికారులు

ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పుడే కుటుంబ ప్రగతి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మురళి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో గ్రామీణ బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ కాశప్ప, వెలుగు ఆఫీసర్ ఓబులేను అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ప్రభుత్వ భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరూ ప్రమాద భీమా, జీవన భీమా పథకాల్లో చేరాలని సూచించారు. పదేళ్లలోపు ఆడపిల్లలు ఉన్న తల్లితండ్రులు వారి భవిష్యత్తు భద్రత కోసం సుకన్య సంవృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించాలన్నారు. అదేవిధంగా బ్యాంకుల్లో పేరుకుపోయిన అన్ క్లైమ్స్ డిపాజిట్ల వివరాలు తెలుసుకుని నిబంధనల ప్రకారం క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదని హెచ్చరించారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను దుబారా చేయకుండా, జీవనోపాధి కార్యకలాపాలకు మాత్రమే వినియోగించి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఎల్ కౌన్సిలర్లు నాగభూషణ) రామకృష్ణ, వెంకటకృష్ణారెడ్డి, తెలుగు సిబ్బంది. మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యోపకరణాలు పంపిణీ

పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త


విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్ పరిధిలోని సూపర్ హాస్పిటల్ వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో సామకోటి ఆదినారాయణ పిల్లలకు పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్ళాలని, ప్రతి ఒకరు చెట్లను నాటి, పరిసర ప్రాంతాలను క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచుకుందామని పిలుపునిచ్చారు. అత్యధిక శాతం చెట్లను పెంచాలని సేవ్ దత్రీ సేవ్దనేచర్" అనేనినాదంతో తోడ్పడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్, కేశవ, నరసింహులు, మారుతి, మహబూబ్ బాషా, రవి కుమార్, నరేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## చాబాల చెరువుకు నీటి మళ్లింపు పనులు ప్రారంభం

వజ్రకరూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మండలంలోని చాబాల చెరువుకు నీటి మళ్లింపు పనులను తెదేపా నాయకులు తిమ్మప్ప, ఈశ్వరయ్య, చాబాల మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, రవిలు మంగళవారం ప్రారంభించారు. రాగులపాడు హంద్రీనీవా కాలువ నుండి ధర్మపురి కెనాల్ బ్రాంచ్ కు వెళ్తున్న నీటిని చాబాల చెరువుకు మళ్ళించాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులుదృష్టికి తెలుగుదేశంపార్టీ నాయకులు తీసుకువెళ్లారు. కాలువలలో పూడికను తీయించి ముళ్ళ పొదలు తొలగించి నీటిని చెరువుకు మళ్ళించేలా చర్యలు చేపట్టాలని హెచ్ ఎన్ఎస్ఎస్ఏ ఈఈ భాస్కర్కు ఆర్థిక శాఖ మంత్రి ఆదేశించారు. అధికారులు పనులు వేగవంతంగా చేపట్టారు. చెరువుకు నీరు చేరడం ద్వారా పరిసర ప్రాంతాలలోని బోర్లలో భూగర్భ జలాలు పెరిగి నీటి ఎద్దడి తగ్గుతుందని, పశువులకు గొర్రెలకు నీటి సమస్య తీరుతుందని టిడిపి నాయకులు తెలిపారు. అవసరము, అవకాశం ఉన్న ప్రతి చోట పయ్యావుల సోదరులు హంద్రినివా కాలువ నీటిని చెరువులకు మళ్ళించి నీటితో నింపుతున్నారని వారు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులకు నీటిని అందించిన ఘనత పయ్యావుల కేశవ్ కి దక్కుతుందన్నారు. చెరువులకు నీరు అందడం ద్వారా ఎంతో మంది రైతులు పంటలను సాగు చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు.


పనులను ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

## నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

అమరాపురం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


ఎర్ర బ్యాడ్జీలతో నిరసన దృశ్యం

మడకశిర ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఎర్ర బ్యాడ్జిలు ధరించి తమ విధులకు హాజరైనట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీని నిర్వీర్యం చెయ్యాలనే ఉద్దేశంతో ఏపీఎస్ఆర్టీసీ సంస్థ మరియు ప్రభుత్వం నిర్ణయానికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎర్రబాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో 12డిపోలను ఖాళీ చేయించి ,పినాకిల్ అను ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పి, ఆర్టీసీ బస్సులను,సిబ్బందిని ఇతర డిపోలకు తరలించాలని, మేనేజ్మెంట్,ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయానికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మీటింగ్ నిర్వహించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో డిపో నాయకులు కరియప్ప ముద్దప్ప జయసింహ సభ్యులు బేగ్, షబ్బీర్ ,జావిద్, అబ్బాస్, ఫక్రుద్దీన్, మారుతి ప్రసాద్, మరియు గ్యారేజ్ రాము, బాబు, నరేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## అవసరమైన మేరకే మందులను పిచికారి చేయండి

బత్తలపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


పంటలను పరిశీలిస్తున్న ఏడిఏ లక్ష్మానాయక్

రైతులు సాగు చేసిన పంటలకు వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు ఎరువులు క్రిమిసంహారక మందులను ఉపయోగించాలని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థకు నమోదు చేసుకోబడిన రైతుల పొలాలను ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్,వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు,పురుగు మందులను సిఫారసు మేరకు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు. అధిక మోతాదులో వాడితే పంట ఉత్పత్తులలో పురుగు మందుల అవశేషాల కారణంగా మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల యొక్క ధ్రువీకరణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ధృవీకరణ పొందిన పంట ఉత్పత్తులు అధిక ధరకు అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, ఎంపిఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన రైతులకు రుణాలు అందజేసి అండగా నిలవండి

శ్రీరామ్ ని సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన డైరెక్టర్లు


పరిటాల శ్రీరామ్ ను కలిసిన నూతన డైరెక్టర్లు టిడిపి నేతలు

బత్తలపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



గజమాలతో పరిటాల శ్రీరామ్ను సన్మానిస్తున్న టిడిపి నేతలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులకు అవసరమైన సేవలను అందించడంలో సహకార సంఘం డైరెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం పట్టణంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో బత్తలపల్లి సహకార సంఘం నూతన డైరెక్టర్లుగా ఎంపికైన నాగార్జునరెడ్డి, బాసిగొండ రవి తదితరులతోపాటు మండల టిడిపి నేతలు పరిటాల శ్రీరామ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రైతులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలని సూచించారు. తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చాలాకీలకంగా ఉన్నాయన్నారు. ఈ మండలాల్లో రైతాంగం ఎక్కువగా ఉందని ఇలాంటి సమయంలో వారికి అవసరమైన సేవలు అందించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. అర్హత ఉన్న ప్రతిరైతుకు రుణాల మంజూరు,సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ వంటివి అందేలాచూడాలన్నారు. సొసైటీ ఆర్థిక ప్రగతికి,కార్యకలాపా లను పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్న తప్పిదం వల్ల అది ప్రభుత్వానికి మచ్చతెస్తుందని దీనిని మీరు బాధ్యతగా తీసుకోవాలని శ్రీరామ్ సూచించారు. అనంతరం తమను డైరెక్టర్లుగా నియమించినందుకు పరిటాల శ్రీరామ్ను శాలువాకప్పి సన్మానిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సురేంద్ర నాయుడు, మార్కెట్యార్డ్ వైస్చైర్మన్ అయ్యప్ప, చల్లా శ్రీనివాసులు, చిట్రా నాగభూషణ, బాల రంగారెడ్డి, కేశవరెడ్డి, వెంకట్రాముడు, ప్రభాకర్ రెడ్డి, బాలాంజనేయులు యాదవ్, సూరి, కేశవ, చౌదరి, నారాయణస్వామి, శ్రీనివాసులు, కమతం మోహన, విశ్వనాథ్, ఉమ్మాల చంద్రశేఖర్, శివయ్య, ప్రసాద్, అశోక్, కిష్టయ్య, చంద్రశేఖర్నాయుడు, శ్రీనివాసులు, శ్రీరాములు, నాగేంద్ర, అక్కులప్ప పాల్గొన్నారు.

## ప్రశాంతంగా కాటకోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

డీఎస్పీని సన్మానించిన చిల్లవారిపల్లి గ్రామస్థులు

ధర్మవరం టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


డీఎస్పీని సన్మానిస్తున్న చిల్లవారిపల్లి వాసులు

మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీకాటకోటేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించిన ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ను గ్రామస్థులు సన్మానించారు. ఈ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటుచేసి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చేసిన డీఎస్పీని మంగళవారం ధర్మవరంలో చిల్లవారిపల్లి గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. ఉత్సవాలలోవేలాదిమంది తరలివచ్చిన భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలోనూ, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడటంలోనూ పోలీసులు పోషిస్తున్న పాత్రను గ్రామస్థులు కొనియాడారు.

## రేపు ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతంచేయండి

ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

ఉపాధ్యాయ, విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు బలరాముడు, రవీంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఈ దర్నాకు ధర్మవరంఅర్బన్, ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, సీకేపల్లి, కనగానపల్లి, రామగిరి, ముదిగుబ్బ మండలాల నుంచి అదికసంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతంచేయాలన్నారు. పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, ఐఆర్ ను 30శాతంగా ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదలచేయాలని తదితర డిమాండ్లపై ధర్నా చేయడం జరుగుతుందన్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తాం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి కంపన్న

అమరాపురం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


రికార్డులను తనిఖీ చేస్తున్న గ్రంథాలయ కార్యదర్శి దృశ్యం

ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వడ్డే వెంకట్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.కంపన్న తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రికార్డులను స్థానిక గ్రంథాలయ ఇన్చార్జ్ లైబ్రేరిన్ భాస్కర్ సమక్షంలో పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాల్లో లైబ్రరీ పోస్టులు తక్కువ ఉండడంతో కొన్ని గ్రంథాలయాలకు ఇన్చార్జిలను నియమకం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో ఉన్న పాత పుస్తకాలకు బదులు నూతన టెక్నాలజీ తో కూడిన అధునాతనమైన పుస్తకాలను సరఫరా చేయాలని పాత్రికేయులు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా అమరాపురం గ్రంథాలయం పాత నీటి ట్యాంకులో నిర్వహిస్తున్నట్లు సత్వరమే కొత్త భవనాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా మండలంలో ప్రముఖ ఆధ్యాత్మిక మరియు శిల్ప కళలకు ప్రసిద్ధిగాంచిన హేమావతి గ్రామం నందు సబ్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని పాత్రికేయులు కోరారు. సత్వరమే ప్రభుత్వం దృష్టికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సమక్షంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ సిబ్బంది మారన్న, వీరకేతప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ముందు నేషన్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గేట్ మీటింగ్

- వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసిన నాయకులు


ఉరవకొండ ఆర్టీసీ డిపో ముందు ఎర్రబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్

ఉరవకొండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎర్రబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ఎం.నారాయణస్వామి మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ యాజమాన్యం రాష్ట్రంలోని ముఖ్యమైన 12 డిపోలకు ఎలక్ట్రిక్ బస్సులను మినాకిల్ సంస్థ ద్వారా నిర్వహించాలని అందులో డిపోల షెడ్యూల్, సిబ్బందిని ఇతర డిపోలకు బదిలీచేసి ఆడిపోలను పూర్తీ స్థాయిలో ప్రైవేటుకు అప్పజెప్పాలన్న అలోచనను సంస్థయాజమాన్యం మానుకోవాలన్నారు. విద్యుత్ బస్సులపేరుతో ఆర్టీసీడిపోలను మూసివేయాలని చూడటం సరైంది కాదన్నారు. జీసీసీ మోడల్ రద్దుచేసి విద్యుత్ బస్సులు నేరుగా ఆర్టీసీకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు వి.వీరేష్గౌడ్, కె. సాంబశి, సి.శ్రీరాములు, జి.వలి, గోవిందప్ప, గ్యారేజీ సిబ్బంది ఎం.మీరాన్బాషా, ఇక్బాల్, ఎస్.బాషు, ఎస్.ఎం.బాషా, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అనర్థదాయకం

-వెలగొండలో బాల్య వివాహాల ముక్త భారత్ కార్యక్రమం

ఉరవకొండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి

బాల్య వివాహాలు అనర్థదాయకమని తద్వారా ముఖ్యంగా బాలికల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అన్నారు. బాల్య వివాహాల ముక్త భారత్ వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ బాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్ల చేయడంవల్ల చదువుపాడై భవిష్యత్తు అంధకారమవుతుందని ఎన్నో అనారోగ్య సమస్యలు వచ్చి అవగాహనలేక కుటుంబాలు, జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అడ్డుకొని 1098కు సమాచారం అందించాలన్నారు. ఆడబిడ్డలను బాగా చదివించాలని అప్పుడు వారు అన్ని రంగాల్లో రాణిస్తారని, బాలికల బంగారు భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పదజకాలను అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సచివాయ సిబ్బంది, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురు రాఘవేంద్రస్వామి 431 జయంతోత్సవం

- స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

గురు రాఘవేంద్రస్వామి 431వ జయంతోత్సవం స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం అష్టమి మంగళవారం పట్టణంలోని మంత్రాలయ గురు రాఘవేంద్రస్వామి శాఖామఠంలో భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్ (బృందావనం)కు ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకోగా వారికి తీర్థప్రసాదాలు అందించారు.


శాఖా మఠంలో గురు రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

## సోమందేపల్లిలో అంగన్వాడీల రిలే దీక్షలు

సోమందేపల్లి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

మండల కేంద్రంలోని స్థానిక సిడిపిఓ కార్యాలయం వద్ద రెండవ రోజు అంగన్వాడి హెల్పర్ల రిలే దీక్షలు కొనసాగాయి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేయాలి , సమ్మె ఒప్పందాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఐసిడిఎస్ సంస్థ పరిరక్షణ కోసం నిధుల కేటాయించి సమ్మె ఒప్పందాల అమలుకు నిధులు కేటాయించాలని లేనిపక్షంలో రాబోవు కాలంలో అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు అనంతరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సుదీర్ఘమైన పోరాటాలు నిర్వహిస్తామని ఇందుకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాబు , మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ , రవి , కుమ్మర కిష్టప్ప , నాగభూషణ , సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేష్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న , అంగన్వాడీ మహిళలు ,పాల్గొన్నారు.

## ఇండియా బాల్టిక్స్ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ అధ్యక్షుడిగా ఎంపిక పట్లహర్షం

అమరాపురం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త


వైకాపా నాయకుల దృశ్యం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఎంపీ మిథున్ రెడ్డి ని 14వ లోకసభలో బాల్టిక్స్ పార్లమెంటరీ ఫ్రెండ్లీ గ్రూప్ అధ్యక్షుడిగా లోకసభ స్పీకర్ ఓన్ బిర్లా నియామకం చేపట్టడం పట్ల వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమరాపురం సర్పంచ్ ఎం వాగేష్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా18 వ లోక్ సభలో ఇండియా బాల్టిక్స్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్అధ్యక్షుడిగా వ్యవహరించనున్నఎంపీ మిథున్ రెడ్డికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లువారు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను పొందాలని వారు ఆకాంక్షించారు.

## మండల ప్రజలతో ప్రత్యేక శాంతి కమిటీ

- దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలు పని చేస్తున్నాయి
- ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ నరసింగప్ప
- నాలుగు నెలల క్రితం దొంగిలించిన గణపతి దొంగలను శిక్షించండి : గ్రామస్తులు


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ నరసింగప్ప

అగళి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

గత నాలుగు నెలల క్రితం పురాతన శంకరేశ్వర స్వామి దేవాలయం వద్ద ఉన్న గణపతి ఆలయంలోని 400 కెజిల రాతి విగ్రహాన్ని దొంగలు దోచుకెళ్లారు. ఆ గణపతి దాదాపు 700 సంవత్సరాల నాటిది. గణపతికి పూజలు చేయడం ప్రజలకు సెంటిమెంట్, గణపతి విగ్రహాన్ని గుప్త నిధుల వేటగాళ్లను పట్టుకోవాలని భక్తులు వివిధ రూపాల్లో సమస్యను పరిష్కరించాలని విన్నవించుకుంటున్నారు. కలెక్టర్కు, ఎస్పీకి ఇలా


హాజరైన గ్రామస్తులు

విషయాన్ని తెలియజేశారు. ఈ విషయమై మాట్లాడటానికి ప్రత్యేకంగా డిఎస్పీ నరసింగప్ప మంగళవారం సాయంత్రం అగళి పోలీస్స్టేషన్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలతో శాంతి కమిటీని ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమై చర్చించారు. దొంగిలించిన విగ్రహం స్థానంలో కొత్త విగ్రహంపెట్టడానికి పోలీసులు సిద్దంగా ఉన్నారని తెలపగా, అందుకు ప్రజలు ఒప్పుకోలేదు. మేమే చెందాలు వేసుకుని విగ్రహాలు పెట్టడానికి సిద్దంగా ఉన్నాము కానీ పురాతనమైన ఆపాతగణపయ్య విగ్రహమే తమకుకావవాలని మూకుమ్మడిగా పోలీసులను డిమాండ్చేశారు. అందుకుస్పందించిన డిఎస్పీవిగ్రహ దొంగిలించిన విషయమై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, ఇప్పటికీ 3 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి బెంగుళూరు, తుమకూరు, విజయనగర, హంపి, వసిపేట, హుబ్బలి, దార్వాడ, బళ్లారి తదితర ప్రాంతాలకు ప్రత్యేక టీంలను పంపి విచారణ చేయిస్తున్నామని, గుప్త నిధుల తవ్వకం దారులను ఇప్పటికే కొంత మందిని పట్టుకుని వచ్చి కౌన్సిలింగ్ చేసి విచారించామని, ఇప్పటివరకు దొంగలఆచూకీ దొరకలేదని, పోలీసులఅన్వేషణ కొనసాగుతోందని, విచారణచేసి తప్పకుండా దొంగల్నిపట్టుకుని శిక్షించడంతోపాటు విగ్రహాన్ని రికవరీ చేస్తామని డిఎస్పీ సమావేశంలో తెలిపారు. గతంలో గుప్త నిధులు తవ్విన పాతవారు, పాతటీంఉన్నా రహస్యంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏ క్లూ దొరికినా పోలీసులకు చేరవేస్తే ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజ్కుమార్, ఎస్ఐ శోభరాణి, పోలీసు సిబ్బంది ఉన్నారు. గ్రామస్తుల తరపున గ్రామ పెద్దలు డిఎస్పీ, సిఐ, ఎస్ఐని ఘనంగా సన్మానించారు.

## వైభవంగా ప్రారంభమైన లక్ష్మివెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

- శాస్త్రోక్తంగా కళశస్థాపన, దీక్షా హోమాది పూజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మివెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ అష్టమి మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సూర్యోదయ పూర్వం మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, గోమాత పూజ, ద్వారపూజ, యాగశాల ప్రవేశం, ప్రధాన కళశస్థాపన, వాస్తు, గణపతి, నవగ్రహ లక్ష్మివెంకటేశ్వరస్వామి మహామంత్ర జపం తదితర పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయం లోని పంచముఖ ఆంజినేయస్వామి మూలవి రాట్కు విశేష పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవ పూజలు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహారదీక్షలో మాట్లాడుతున్న జ్యోతిలత

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాడిపత్రి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, మండల కార్యదర్శి నాగరంగయ్య, ఏఐటియుసి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జ్యోతిలత, నాగేశ్వరమ్మ, శంకరమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలైన వేతనాల పెంపు, ఉచిత గ్యాస్ సరఫరా, వేసవికాలంలో మే నెల అంతా సెలవులు ఇవ్వాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్లపై రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడి సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నాగేంద్ర, అబ్రహం, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

**యాడికి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

యాడికి మండల కేంద్రం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-4 ఆవరణలో మంగళవారం ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కౌట్ వ్యవస్థాపకులు రాబర్ట్ బెడన్ పావెల్, ఓలవీ బడెన్ పావెల్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఎం.కాశెప్ప మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లలకు సేవాభావం, క్రమశిక్షణ, సహాయం చేసే మంచి లక్షణాలు అలవాటు చేయడంలో ఈ స్కౌట్ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ స్కౌట్ కార్యక్రమాలకు తన వంతు పాఠశాలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రిటైర్డ్ హెచ్ఎం విజయమ్మ స్కౌట్ యూనిట్‌కు 7 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్తులో స్కౌట్ కార్యక్రమంలో భాగంగా ఏదైనా ఆర్థిక సహాయం అందించడానికి తన వంతు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే ఇటువంటి మంచి క్రమశిక్షణ కలిగిన స్కౌట్ గురించి తెలియపరచి ఆపద సమయంలోను, ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే సహాయ, సహకారాలు చేసే విధంగా చిన్న వయసులోనే ఆలోచన చేసే మంచి కార్యక్రమం స్కౌట్ అని కొనియాడారు. అనంతరం స్కౌట్‌కు విరాళం అందచేసిన విజయమ్మను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, శైలజకుమారి, రవీంద్ర, వరలక్ష్మి, పద్మావతి, రంగస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

**యాడికి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి మండలంలోని వెంగన్నపల్లి గ్రామంలో గుత్తి సూర్యనారాయణరెడ్డి (70) అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా వున్నాయి. వెంగన్నపల్లి గ్రామంలో నివసిస్తున్న గుత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం ఛాతినొప్పితో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లడం జరిగింది. దీంతో డాక్టర్లు సూర్యనారాయణరెడ్డిని పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడికి వున్న కుమారుడు ఇదివరకే మరణించడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవరూ లేకపోవడంతో వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ సంఘం అధ్యక్షుడు జి.నాగమునిరెడ్డి యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి సమాచారం అందించి మృతుని అంత్యక్రియలు పూర్తి చేయాలని కోరారు. దీంతో ఫౌండేషన్ సభ్యులు యాడికి నుంచి వెంగన్నపల్లి గ్రామానికి వెళ్లి మృతుని అంత్యక్రియలను వారి సాంప్రదాయ పద్ధతిలో పూర్తి చేయడం జరిగింది. గుత్తి సూర్యనారాయణరెడ్డి అంత్యక్రియలను పూర్తి చేసినందుకు ఆయన భార్య, గ్రామస్తులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు చందగాని ధ్రువనారాయణ, సాయివరపు నాగరాజు, కావలి సుధాకర్, బోయ అశోక్, కుమార్ పాల్గొన్నారు.

## కాశేపల్లిలో గడ్డివాము దగ్ధం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

పెద్దవడుగూరు మండలం కాశేపల్లి గ్రామంలో సుదర్శన్‌రెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాముకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో గడ్డివాము తగ్ధమైంది. ఈ సంఘటనపై సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గడ్డివాము విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలియచేశారు.

## 5 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

- రూ.5,090 స్వాధీనం

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామ సమీపంలోని వంకలో పేకాట ఆడుతున్న వారిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 5,090 రూపాయలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి



స్పోర్ట్స్‌మీట్ తిలకిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్యేల స్పోర్ట్స్ మీట్‌లో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి తిలకించారు.

## అంగన్‌వాడీల రిలే దీక్షలకు ఆర్టీసి కాంట్రాక్ట్ కార్మికుల సంఘీభావం



అంగన్‌వాడీల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

ఏపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండవ రోజు రిలే నిరాహార దీక్షలకు ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పవన్‌కుమార్, మమ్మద్‌రసూల్, షెక్షావలి, శ్రీకాంత్‌లు మంగళవారం సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తాము అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మిక హక్కులను అమలు చేయాలని వారు మద్దతు ప్రకటించారు. వీరికి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) తాడిపత్రి మండల కమిటీ తరఫున మండల అధ్యక్షులు ఉమాగౌడ్, మండల కార్యదర్శి నరసింహారెడ్డి, మండల ట్రెజరర్ హనుమంతురెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడి కార్మికుల పోరాటానికి వివిధ కార్మిక సంఘాల మద్దతు లభించడం ఉద్యమానికి మరింత బలం చేకూరుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

## మైనారిటీల పథకాల అమలులో పురోగతి సాధించాలి

డా:సయ్యద్ నాసిర్ హుస్సేన్



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**బళ్లారి,ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)**

డా:సయ్యద్ నాసిర్ హుస్సేన్ మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు చేస్తున్న పథకాలపై సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని కొత్త జిల్లా పరిపాలన భవన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమం జిల్లా స్థాయి ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.మైనారిటీలకు అందుబాటులో ఉన్న లబ్ధిదారుల ఆధారిత మరియు సమాజ ఆధారిత పథకాల జాబితాను రూపొందించి, విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమాజంలో సమాచారం లోపం వల్ల అర్హులైన వారు పథకాల కోసం దరఖాస్తు చేయడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.బ్యాంకు రుణ సౌకర్యాల కోసం అవసరమైన పత్రాలపై లబ్ధిదారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, సంబంధిత అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుని సహకరించాలని పేర్కొన్నారు.నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నగరంలోని వక్ఫ్ ఆస్తుల స్వాధీనం కేసుపై వెంటనే అవసరమైన పత్రాలు పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా వక్ఫ్ అధికారికి స్పష్టం చేశారు. డిప్యూటీ కమిషనర్ నాగేంద్ర ప్రసాద్.కె మాట్లాడుతూ, శాఖల వారీగా భౌతిక,ఆర్థిక లక్ష్యాలపై స్పష్టమైన వివరాలతో సమావేశాలకు హాజరు కావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హరిస్ సుమేర్, జెడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే,మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజు,కర్ణాటక మైనారిటీ అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ మెహబూబ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న గుమ్మనూరు ఈశ్వర్

**బళ్లారి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

బళ్లారి పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కనక దుర్గ టెంపుల్ లో జరుగుతున్న దుర్గమ్మ సిడి బండి ఉత్సవాల సందర్భంగా యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.గుంతకల్ నియోజక వర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం గారి తనయుడైన గుమ్మ నూరు ఈశ్వర్,పామిడి మరియు గుత్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హోదాలో ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, భక్తులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆలయ పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు,పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన తీర్థప్రసాదాలు స్వీకరించి, రాష్ట్ర ప్రజల సంక్షేమం,శాంతి సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు.ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది.యువనేత ఈశ్వర్ ఆలయ సందర్శనతో స్థానిక కార్యకర్తలు, అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకుంటున్న గుమ్మనూరు ఈశ్వర్

## ద్విచక్ర వాహనాలు బహిరంగ వేలం

**బ్రహ్మసముద్రం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మండల పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలను 25022026తేదీ గురువారం కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నందు వేలం వేయబడునని కావున ఆసక్తి కలవారు దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినది గా బ్రహ్మసముద్రం యస్ ఐ సాయి కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

## ఛలో విజయవాడ జయప్రదం చేయండి

- ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు

**కదిరి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మార్చి 2న ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజు కొనసాగాయి. దీక్షల్లో ఏఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఆంజినేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు చేపట్టామని, మొదటి రోజు విజయవాడ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణితో యూనియన్ నేతలు చర్చలు జరిపినా డిమాండ్ల పరిష్కారం కాలేదని, కావున ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షల్లో మధునాయక్, అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్లు సుశీల, భాగ్యలక్ష్మి, శారద, రమణమ్మ, శాంతి, లక్ష్మిదేవి, పార్వతి, గిరిజారాణి, శాంతమ్మ, పవన్, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సిఐటియు ఆధ్వర్యంలో..** ఐసిడిఎస్ నిధులు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు 26వేలు వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాబ్‌జాన్,జగన్, రైతుసంఘం నాయకులు సుధాకర్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సుజాత, ప్రమీళ, రాణి, సుశీల, రాధ, సువర్ణ, రామలక్ష్మి, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి జయంతిని సభను విజయవంతం చేయండి



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 109వ జయంతి సందర్భంగా ఈ నెల 25న కూడేరులో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు, వేతనజీవులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద జయంతి సభ పోస్టర్లను మండల నాయకులతో కలసి ఆవిష్కరించారు. తరిమెల నాగిరెడ్డి జయంతి సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు హాజరవుతారాన్నరు. కూడేరులో 25 ఉదయం ప్రదర్శన, 11 గంటలకు బహిరంగ సభ ఉంటుదన్నారు. కావున ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయపద్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్ నాయుడు, నాగరాజు, శ్రీనాథ్, అంజినప్ప, మహుబూబ్ బాష, కాసింసా తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో మహిళ మృతి

**తనకల్లు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



పాముకాటుతో మృతి చెందిన ముకుందమ్మ

తనకల్లు మండల పరిధిలోని రాగికుంటపల్లికి చెందిన పి.ముకుందమ్మ (40) అనే మహిళ పాముకాటుతో మృతి చెందింది. ముకుందమ్మ పొలానికి వెళ్లి పనులు చేసుకుంటుండగా పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో కదిరికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముకుందమ్మ మృతి చెందినట్లు సమీప బంధువులు తెలిపారు. ముకుందమ్మకు భర్త, నలుగురు పిల్లలు వున్నారు. ముకుందమ్మ అంత్యక్రియల్లో నాయకులు, మాజీ సింగిల్‌విండో బాగేపల్లి చలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు. పాముకాటుతో ముకుందమ్మ మృతి చెందగా ఆమె భర్త అనారోగ్యవంతుడు కావడంతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వీరాంజనేయస్వామికి ఆకుపూజలు

**తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన కోనవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా రంగనాథస్వామి, షిరిడిసాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులు అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు.

## ఆర్టీసి డిపోలో ఎర్ర బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

తాడిపత్రి ఆర్టీసి డిపోలో మంగళవారం ఉదయం ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డిపో సెక్రటరీ కెజిఎన్ బాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రీజినల్ కార్యదర్శి ప్రతాప్‌నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రవేటీకరణ విధానం మానుకోకుంటే ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఇందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ రంగేశ్వర్‌రెడ్డి. గ్యారేజ్ సెక్రటరీ కె.రామక్రిష్ణ, గ్యారేజ్ ప్రెసిడెంట్ ఎస్ఆర్‌కె రెడ్డి, సిసిఎస్ డెలిగేట్ మోహన్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ బాలపెద్దన్న, ఉపాధ్యక్షుడు బాల రంగయ్య, సీనియర్ నాయకులు డివి నారాయణ, ఎషోబ్, కెవి రాముడు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## రబీ సీజన్‌లో పంటలు వేసిన రైతులందరూ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి




కామారు పల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలంలో రబీ సీజన్ లో పంటలు వేసిన ప్రతి రైతు తప్పకుండా క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట కుమార్ తెలిపారు. మంగళవారం అనంత రూరల్ మండలం కామరు పల్లి మరియు కురుగుంట గ్రామం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఏ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రబీ సీజన్లో సాగుచేసిన మొక్కజొన్న పంట లో కత్తెరపురుగు ఉన్నట్లుఅయితేక్లోరాంట్రోనిలిప్రోల్ 0.5 ఎంల్ లేదా ఇమేమేక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి కలిపిపిచికారీచేసుకోవాలి.అలాగే యూబారైజెషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్ కూడా ప్రతి రైతు మీ ఫోన్ నందు ఇన్స్టాల్,చేసుకోవాలనితెలియజేసారు.ప్రతి రైతు మీకు దగ్గరలో గల రైతు సేవా కేంద్రానికివెళ్లి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ప్రతి రైతుకు 11 అంకెలకల రైతు విశిష్ట సంఖ్య ప్రతి రైతుకు కేటాయించడం జరుగునని ఈ రైతు విశిష్ట సంఖ్యను ఆధారంగా పీఎం కిసాన్‌ఎరువులుపురుగుమందులు ఇతర సబ్సిడీలు ఏవైనా విశిష్ట సంఖ్య ఆధారంగా ఇవ్వడం జరుగును కాబట్టి ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాల్సిందిగా రైతులను ఆయన కోరారు. ఇక మీదట ప్రతి రైతు కూడా మీరు తమ పంటను మీరే నమోదుచేసుకోవచ్చాన్నారు.ఈ కార్యక్రమం నందు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బ్యాళ్ళ మురళీకృష్ణ, యు.భాగ్యశ్రీ, గ్రామ ఉద్యాన సహాయకులు లోకేశ్వరి మరియు యం.పి.ఈ.ఓ రేష్మ ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రాచానపల్లిలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని సకాలంలో పూర్తి చేయాలి



యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ.

**అనంతపురం రూరల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓదివాకర్ సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి తో కలిసి మంగళవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సర్వే వివరాల గురించిసచివాలయ సిబ్బందిని అడిగి ఆరాతీశారు. సర్వేలో కుటుంబంలోని వారి వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీఓ సూచించారు. ఒక్క సర్వే నిర్వహించడానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఒక సచివాలయ ఉద్యోగి ప్రతిరోజు 25 గృహాలను సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు




మాట్లాడుతున్న లక్ష్మి ప్రింటర్స్ యజమాని భాస్కర్ రాయుడు

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

స్థానిక అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జాన్‌గూటెన్‌బర్గ్ జయంతి సందర్భంగా ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన ప్రింటర్స్‌డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ప్రింటర్స్‌ను సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జర్మనీకి చెందిన జాన్ గూటన్‌బర్గ్ 1440 సంవత్సరంలో కనిపెట్టిన ముద్రణ యంత్రం వలన పుస్తక ప్రచురణలో విప్లవాత్మకమైన మార్పులకు దారితీసిందని, జ్ఞానం మరియు విద్యను వ్యాప్తి చేయడానికి సహాయపడింది.అతను కనిపెట్టిన ముద్రణ యంత్రం ఆధునిక ప్రపంచాన్ని మార్చిన ఒక ముఖ్యమైన ఆవిష్కరణ అని, ఈ ముద్రణ యంత్రం యొక్క ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ సెక్రటరీ రాంనారాయణ, సెక్రటరీ చాంద్‌బాష, రాధా ప్రింటర్స్ ప్రసాదరావు, లక్ష్మి ప్రింటర్స్ భాస్కర్ రాయుడు అనంతపురం జిల్లాకు చెందిన ప్రింటర్స్, ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు, ప్రింటర్స్ పాల్గొన్నారు

## గుత్తిలో ఆర్టీసి కార్మికుల ధర్నా




కార్మికులు ధర్నా చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

గుత్తి పట్టణం లోని ఆర్టీసి డిపో ఎదురుగా మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి వెంకటరాముడు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను డిపోలకు అప్పగించకుండా, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణమైన విషయమన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణను డిపోలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి గౌడ్, అధ్యక్షుడు అంజి, బాల, ప్రసాద్, రంగనాయకులు, పెద్దన్న, వలి, నారాయణ, మస్తానయ్య, శేఖర్, సుంకన్న, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి తగాదాలో వ్యక్తిపై దాడి

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లి గ్రామంలో ఆస్తి తగాదా విషయంలో నాగన్న అనే వ్యక్తిపై ముత్యాలు అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో నాగన్న ఎడమ చేతికి గాయమైంది. బాధితుడు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.



గాయమైన దృశ్యం

